


# మా ఎస్కర్షన్ టూరప్పుడు...

ప్రెయిర్ గ్రౌండులో ప్రెయిరు అయిపోయింది.

ఇంక ఎస్పీయల్‌గాడు కాలు నేలకేసి దబీమని బాది స్కూల్ డిస్పస్ అంటాడేమో, కిలాసులోకి పోయి పస్తు పిరీడుకొచ్చే జె.నాగేశ్వరరావు ఐవోరి పాలపడదాము అనుకుంటా ఉండగా నెమ్మదిగా వచ్చి కుమారస్వామి ఐవోరు స్టేజీ ఎక్కాడు. ఇదేందిరా సామీ ఈ మనిషి యియ్యాల పైకొచ్చి నిలబడ్డాడు ఎవరికి మూడింది అని అనుకుంటా ఉండగా, ఆయన గొంతు సవరదీసుకొని 'యిద్యార్దులారా' అని మొదలుబెట్టి –

'నేను చెప్పేది మొత్తం ఒకసారి వినండి. విన్నాక నేను ఎత్తమన్నప్పుడు చేతులెత్తండి. సరేనా?' అన్నాడు.

'సరే సార్' అన్నాం మేమంతా– ఏమి అర్దం కాకపోయినా.

' సంగతేందిరా అనంటే మనం ఈ సంవచ్చరం ఎస్కర్షన్‌కి పోతా ఉన్నాం. ఎట్టా ప్రెతి సంవచ్చరం చిన్నా చితకా ఎస్కర్షన్లకి పోతా ఉన్నాం గాబట్టి ఈసారి ఎళ్తే గిళ్తే పెద్ద టూరే ఎళ్దాం అని ఐవోర్లు కూడా అంటా ఉన్నారు గనక పెద్ద టూర్లే ప్లాను చేసినాం. అయితే

మేము రెండు టూర్లు అనుకుంటా ఉన్నాం. ఆ రెండూ విని ఏది బాగుంటే దానికి చేతులెత్తండి. మీరు దేనికి ఎత్తితే దానికే'.... అంటా ఉండగానే పిలకాయల్లో గలగలమని రావాకులు ఆడినట్టుగా గోల మొదలైపోయింది.

నవ్వులు, ఇకఇకలు, పకపకలు... టూరనేసరికి సంతోషంతో ఒళ్లు పట్టలేనంత హుషారు. అది చూసి కుమారస్వామి ఐవోరు ఎస్పీయల్లు కంటే గోరంగా కాలు నేలకేసి దబీమని బాది 'సైలెన్స్' అని అరిచినాడు.

మేము గమ్మునైపోయాం.

'ఊ. అదీ. అట్టుండండి. ఇప్పుడు మనకాడ రెండు టూర్లున్నాయి. ఒకటి మద్రాసు, ఊటి, కొడైకెనాలు టూరు. దీనికి నాలుగు రోజులు. కర్చు మనిషికి రెండొందల యాభై. ఇది నచ్చితే దీనికి చేతులెత్తండి. ఇంక రెండోది హంపి, అజంతా, ఎల్లోరా, బొంబాయి, హైదరాబాదు టూరు. దీనికి ఏడు రోజులు. కర్చు మనిషికి మూడు వందల యిరవై. నచ్చితే దీనికి చేతులెత్తండి. టిపిను గిపిను అన్నం గిన్నం అంతా మేమే పెడతాం. పై కర్చులకి మాత్రం మీరు డబ్బులు తెచ్చుకోవాలి. ఇప్పుడు ఐదు నిమిషాలు టైము యిస్తా ఉన్నా. ఈ లోపల మీరు ఆలోచించుకొని చేతులెత్తండి' అన్నాడు.

ఆయన ఆ మాట ఆపడం, మళ్లా పిలకాయల గోల మొదలుగావడం ఒకేసారి జరిగిపోయాయి. అప్పటి దాకా యే సెక్షను వాళ్లు ఆ సెక్షను క్యూలలో వొరుసగా నిలబడి ఉన్నారా, దెబ్బకి గుంపులు గుంపులుగా చెదిరిపోవో ఎవరి ఫ్రెండుల కాడ వాళ్లు నిలబడ్డారు.

నేను గబగబా తోసుకుంటా పోయి బి సెక్షను క్యూలో ఉన్న శ్రీదరుగాడి దగ్గర చేరాను. ఈ లోపల కందుల మాలకొండరావుగాడు, కాండూరి మురళీగాడు కూడా వచ్చి మా కాడ నిలబడ్డారు.

'మావా. ఏందిరా పరిస్థితి' అన్నాను శ్రీదరుగాడితో.

'ఏముందిరా. ఎట్టాగయినా దీనికి వెళ్లాల్సిందేరా. మా నానమ్మది ఈతముక్కల. మా అమ్మది పెనుబల్లి. పుట్టి మాట నేర్చిన కాణ్ణుంచి ఈ రెండూర్లు తప్ప యింకే ఊరూ చూసింది లేదురా. ఎట్టాగైనా దీనికి పోవాలిరా' అన్నాడు శ్రీదరుగాడు ఆత్రం ఆత్రంగా.

'మరి ఎట్టరా? క్యాషు ఎక్కవగా అడుగుతున్నాడు గదరా కుమారస్వామి ఐవోరు' అన్నాను నేను టెన్షను పడతా.

'క్యాషు దేముందిరా. యాజీగా కట్టేస్తా. ఎటొచ్చి ఎస్కర్షన్ అనంటే మా యింట్లో పంపిస్తారో లేదో. మా నానమ్మ ఏమంటుందో ఏందోరా' అన్నాడు ఆలోచనలో పడతా.

'నీ సంగతేందిరా?' అన్నాను మురళీగాడితో.

'మావా. నువు నిజమనుకో అబద్దమనుకో నాకు తెలిసిన ఊర్లు రెండే. ఒకటి కావలి. రెండు గుంటూరు. మా నాన్న గుంటూరులో ఉన్నాడుగాబట్టి ఆడకైనా పోగలిగానుగాని ఆ పక్కనే ఉండే బెజవాడను కూడా చూల్లేదురా. ఇన్ని ఊర్లు చూడకుండా ఎట్టరా ఉండేది? మనం పోవాల్సిందేరా' అన్నాడు వాడు.

ఇంక కందుల మాలకొండరావు వంక చూశాను.

వాడు 'నా బతుకు మరీ అన్యాలంరా. మా నాయన సంవచ్చరానికి ఒకసారి కొండ బిట్రగుంటలో జరిగే తిరనాళ్లకి తీసకెళ్లి అట్టా యిట్టా తిప్పి రెండు చేతుల్లో రెండు చెరుగ్గడలు పెట్టడం తప్పితే ఇంకేడకీ తీసికెళ్లడురా. మీరు తయారయితే నేను కూడా తయారవుతానురా' అన్నాడు.

ఈసారి వాళ్లు ముగ్గురు నా వంక చూశారు, నీ సంగతేంది అన్నట్టు.

'నాకు ఎస్కర్షన్లు కొత్త కాదురా. మా యిద్యానికేతన్‌లో ఉండగా రెండు ఎస్కర్షన్లు అంటే పెంచలకోన, బైరాగికోన వెళ్లి ఎంజాయి చేశానురా. ఇప్పుడు ఈ ఎస్కర్షనుకు కూడా మా నాయన ఒకే అంటాడుగానీ డబ్బులిదేరా ప్రాబ్లము. వంద రూపాయలిస్తే మా అమ్మ పదహారు అప్పులు తీరుస్తుంది. రెండొందలుంటే రెండురోజులకొక తడవ మటను తెచ్చుకొని తిని కమ్మంగా పడుకోవచ్చుగదా అని అడ్డం కొట్టద్దిరా. అదిరా నా దిగులు' అన్నాను.

'అయ్యో. ఎట్టరా. ఎట్టరా' అన్నారు వాళ్లు ముగ్గురు.

'ముందు మీవాళ్లని ఒప్పించరా. తర్వాత డబ్బులు ఎట్టోకట్ట చేద్దాము' అన్నాడు శ్రీదరుగాడు.

'అద్సరేరా. మనం దేనికి చేతులెత్తుదాం రా' అన్నాడు మురళీగాడు.

'డౌటు ఎందుకురా? బొంబాయికే ఎత్తుదాము. మద్రాసుదేముంది చీపు. నెల్లూరు, గూడూరు, తడ దాటితే అవతల అదేగదరా. మా నాయన కరెంటు సామాన్లకని వారానికొకసారన్నా పొయ్యొస్తా ఉంటాడు. అదే బొంబాయి అయితే పోతా పోతా పోతా చాలా దూరం పోతానే ఉండాలి. పైగా ఆడ అమితాబచను ఉంటాడు. అదృష్టం బాగుంటే కళ్లపడతాడు. బొంబాయి ఎళదాముర' అన్నాను నేను.

'నువ్వు చెప్పినాక సరేరా' అన్నారు వాళ్లు.

అందరం బొంబాయి టూరుకే చేతులెత్తాం. కుమారస్వామి ఐవోరు తలాడించాడు.

'సరే అయితే. ముందు ఎవురెవురు వస్తారో వాళ్ల పేర్లిచ్చెయ్యండి. ఫలానా తేదీ లోపల పక్కాగా వొచ్చేవాళ్లంతా డబ్బులు కట్టెయ్యండి. డబ్బులు ముందే గట్టి సీటు బుక్కు చేసుకోకపోతే ఆనేక కుయ్యో అన్నా లేదు, మొర్రో అన్నా లేదు' అన్నాడు స్టేజీ దిగిపోతా.

ఇంక ఆ రోజంతా మా ఇశ్వోదయలో పిలకాయలు పాటాలు వింటే ఒట్టు. అందరి కాడా ఎస్కర్షన్ మాటలే. ఇట్టెళ్లాలి అట్టెళ్లాలి అని కొంతమంది, ఇళ్లకాడ ఇట్టొప్పించాలి, అట్టొపించాలి అని కొంతమంది.

నేను మాత్రం ఇస్కూలు ఇడిచాక సక్కగా వెళ్లి రైల్వేరోడ్డులో ఉన్న మా నాయన అంగడి కాడ నిలబడ్డా.

అంజీ హోటలు కాణ్ణుంచి టీ తెప్పించుకొని, అది చల్లారిపోయిందన్న సంగతి కూడా పట్టించుకోకుండా ఆకురాయితో బేరింగు మీద సాదతా ఉన్న మా నాయన చాలా సేపటికి నా వంక చూసి 'ఏందిరా' అన్నాడు.

'ఏమిలా బా' అన్నాను, ఇనపకుర్చీలో కూచుంటా.

'టీ తాగతా?' అన్నాడు, తెప్పించడానికి జేబులో చిల్లర ఎతుక్కుంటా.

'వొద్దుబా. కుమారస్వామి ఐవోరు నీకు స్పెషలుగా ఒక మాట చెప్పేసి రమ్మన్నాడుబా. అందుకని వచ్చా' అన్నాను.

'ఏం మాటరా?' అన్నాడాయన రొంత అటెన్షనులోకి వొస్తా.

'మా ఇస్కూల్లో ఎస్కర్షన్ ఏస్తా ఉన్నారంట. చాలా మంది పిలకాయలు పోతా ఉన్నారు. వాళ్లంతా పేర్లిస్తా ఉంటే నన్ను పిలిచి, 'మీ నాయనకు చెప్పు. నిన్ను పంపీకుండా ఉంటాడేమో. నేను చెప్పానని చెప్పు. నువు బలే చురుకైన పిల్లోడివి. యిట్టా నాలుగు ఊర్లు తిరిగి చూస్తే ఆ చురుకు యింకాస్త సురసురమంటుందని చెప్పానని చెప్పు. కావాలంటే నాతో వచ్చి మాట్లాడమని చెప్పు అన్నాడుబా' అన్నాను.

మా నాయన తలకాయ పైకెత్తి, చల్లారిపోయిన టీ మొత్తాన్ని ఒక్క గుక్కలో తాగి, నా వంక చూస్తా ముసిముసిగా నవ్వినాడు.

'ఈ మాట కుమారస్వామి అన్నాడా? నువ్వే అంటా ఉన్నావా?' అన్నాడు.

నాకు సిగ్గొచ్చి, నవ్వతా తలకాయొంచుకున్నాను.

'ఏయే ఊర్లంటా?' అన్నాడు.

నేను గబగబా 'చాలా ఊర్లున్నాయి అబా. హంపీ అంట. అజంతా అంట. ఎల్లోరా అంట. బొంబాయి కూడా చూపిస్తారంట' అన్నాను హుషారుగా.

'ఎంతంట?' అన్నాడు సిగరెట్టు ముట్టిస్తా.

'ఎంతబా. రెండొందల మీద యింకో నూరో నూటిరవయ్యి' అన్నాను.

'అంటే మూడొందల యిరవయ్యా?' అన్నాడు నోరెళ్లబెడతా.

నేను ఆయన మనసులోకి ఎక్కడానికి మొకం యిదిగా పెట్టి 'యింకెప్పుడూ ఏమీ అడగనుబా. దీనికొక్కదానికి పంపీబా. శ్రీదరుగాడు, మాలకొండరావుగాడు, మురళీగాడు అందరూ వొస్తా ఉన్నారు. రేప్పొద్దున డబ్బులు కూడా కట్టేస్తా ఉన్నారు ప్లీజ్‌బా ప్లీజ్‌బా' అన్నాను బతిమిలాడతా.

మా నాయన ఆలోచించి ఆలోచించి 'సరేలేరా' అని నన్ను దగ్గరకు తీసుకున్నాడు.

కానీ మా అమ్మ నన్ను ఎత్తి కింద పడేసింది.

'వాడు అడగడం నువ్వు ఊ అనడం. సాసాల్లే ఊర్కోవయ్యో. బలే పంపావుగానీ పిల్లోణ్ణి. అంత దూరం. పైగా అంత కర్చు. తేరగున్నాయా డబ్బులా? నీకాడ అంత మూలగతా ఉంటే నా మొకాన పడెయ్యి. ఇంట్లో దుప్పట్లన్నీ చిరిగిపోయున్నాయి. పోయి నాలుగు కొత్తయ్యి కొనుక్కొస్తా' అంది కోపంగా.

'అమా అమా' అన్నాను నేను.

'అమ్మా లా. లొమ్మా లా. కావాలంటే ఈ రూపాయి తీసుకొని సినిమాకెళ్లి ఆ మాట వొదిలిపెట్టు' అంది కటినంగా.

నేను మా నాయన వంకే చూశాను కళ్లల్లో నీళ్లు పెట్టుకొని.

మా నాయన అది చూళ్లాక 'పోనీలేమ్మే. ఒక పని చేస్తా. అంగడి బాడిగ కట్టడానికి డబ్బాలో రెండొందల దాకా ఏసిపెట్టున్నా. అయి కట్టేస్తా. తక్కిన డబ్బులు ఎట్టా యిళ్లబడి యానివసరీకి లైట్లు వేస్తాను గదా. అందులో కట్ చేసుకోమని చెప్తా. సగంలో

పోతుంది' అన్నాడు మా అమ్మని బుజ్జగిస్తా.

రూపాయి తగ్గితేనే మా అమ్మ మెత్తబడిపోతుంది. సగం అనంటే దిగిరాదా? అతి కష్టం మీద ఊ అంది.

నా లాగా ఎన్ని కష్టాలు పడ్డారో ఎన్ని ఏడ్పులు ఏడ్చారో గాని కేతిరెడ్డి శ్రీదరురెడ్డిగాడు, కాండూరి మురళీగాడు, కందుల మాలకొండరావుగాడు కూడా వాళ్ల ఇళ్లల్లో పర్మీషన్లు సంపాదించేశారు. అందరం డబ్బులు కట్టేశాం.

నవంబరు నెలలో, చలిగాలుల రాతిరిలో, నెల్లూరు కాణ్ణుంచి తెప్పించిన స్పెషలు బస్సు మా ఇశ్వోదయ కాణ్ణుంచి టూరుకి బయలుదేరతా ఉంటే ఓ అంటా అందరిదీ ఒకటే గోల..

'ఒరే బాబూ. కిటికీ లోంచి చేతులు బయటపెట్టబాకా. ఏవిబడితే అవి తినబాకా. మరీ ముఖ్యంగా ఆ కదీరుగాడితో తిరగబాకా' అని శ్రీదరుగాడికి వాళ్ల నానమ్మ హెచ్చరిక.

'ఇదిగో కుమారస్వామా. బంగారం లాంటి పిల్లోడు. వాణ్ణి క్షేమంగా తీసకెళ్లి లాబంగా పట్టకొచ్చే పూచీ నీది. వాడికేమైనా అయ్యిందో నేనూ మా ఇంటామె మీ ఇస్కూలు కాడి కొచ్చి డాం అంటా గుండాగి చచ్చిపోతాం. ఆనేక మావాడు గుంటూరు నుంచి వొచ్చి కేసులు గీసులు అనంటే ఆ బాద నీదే' అని మురళీవాళ్ల తాత కుమారస్వామి ఐవోరికి వార్నింగిచ్చేశాడు.

ఇంక మాలకొండరావు వాళ్ల నాయనైతే 'సార్. మా వాడికి సాంబారు తింటే బేదులవ తాయి. ఇదిగో ఈ మాత్తర్లు మీ కాడ ఉంచి అవసరమైతే ఇస్తా ఉండండి' అని మాత్తర్ల సెట్టు తెచ్చి కుమారస్వామి ఐవోరి జేబులో పెట్టేశాడు చనువుగా.

మా నాయన మాత్రం ఇయన్నీ ఏమీ లాకుండా, అరడజను కార్డు ముక్కల మీద మా ఇంటి అడ్రసు రాసిచ్చి 'యాడ డబ్బా అవుపిస్తే ఆడొక కార్డు ఏస్తుండరా' అని నా చేతిలో పెట్టాడు.

అట్టా బయలుదేరిన మేము మూడు వందల యిరవై రూపాయల కర్చుతో (1986లో) ఏడురోజుల పాటు హోస్పేట, హంపి, షిర్డి, పండరీపురం, అజంతా, ఎల్లోరా, నాసిక్, త్రయంబకం, బొంబాయి, హైదరాబాద్‌లను కళ్ల నిండుగా చూసుకొని కడుపునిండా తృప్తిపడి దేవుడి దయవల్ల క్షేమంగా ఇళ్లకు చేరినాం.

ఇప్పుడు ఈ డబ్బుల్లో ఈ ఊళ్లు చూడగలమా?

అసలు పిలకాయలు ఊళ్లనేవి చూస్తా ఉన్నారా?

చదివి చదివి చస్తా ఉన్నారుగానీ.

■